మధ్యాహ్నం వున్నట్లుండి చినుకులు పడ్డాయి. రోళ్ళు పగిలే ఎండకూ, వళ్ళు తుక తుక లాడించిన వుడకపోతకూ కాస్తంత జీవశక్తి తగ్గినట్లనిపించింది. చల్లగాలి శరీరాన్ని తాకినప్పుడు మనసుకూ చురుకుతనం వచ్చింది. దాంతో ఆలోచన ప్రారంభమైంది. సరిగ్గా అలాంటి సమయంలో నా ఆలోచనల్లోకి

# చీకటి తెరలు

'అభిమన్యు'



ప్రవేశించి కొన్ని రోజుల దాక హృదయాల్ని బరువెక్కించేది మిత్రుడు సీతారామయ్య. ఇప్పుడేకాదు, గత పదేళ్ళగా తొలకరి చినుకులు రాలినప్పుడల్లా సీతారామయ్య నా మనసును ముసురుకుంటూనే వున్నాడు. కలత బెడుతూనే వున్నాడు. ఈసారీ అంతే జరిగింది, సీతారామయ్య కళ్ళముందు కదిలాడు. ఏవిటో ప్రశ్నిస్తున్నాడు. సమాధానం చెప్పలేక పోతున్నా, నా నిస్సహాయతకు సిగ్గుగా వుంది. నాముఖం నిండా మాలిన్యం పులుముకుంది. సీతారామయ్య పక పక నవ్వలేదు. అసహనంగా నా కళ్ళల్లోకి గుచ్చి గుచ్చి చూట్టంలేదు. ఒక రకమైన జాలి — నిర్వికారం సీతారామయ్య చూపుల్లో వ్యక్తమవు తోంది! భరించటం కష్టం! మనసు తెరమీద నుంచి సీతారామయ్య రూపాన్ని చెరిపెయ్యాలి. లేదా మనసును పూర్తిగా నిద్రపుచ్చాలి, అనుకున్నానే గాని రెండు పన్లూ సాధ్యం కాలేదు. వాతావరణం అందుకు భిన్నంగా వుంది.

కళ్ళనిండా సీతారామయ్య కనిపిస్తున్నాడు.

శూన్యమంతా సీతారామయ్యే ఆవరించాడు.

సీతారామయ్యను నేను దూరంచెయ్యలేను. మనసెందుకో సీతారామయ్యంటేనే మనసు పడుతుంది.

పడదుమరీ! కొన్నేళ్ళ పరిచయం అందులో సగంకాలం సన్నిహితమైన స్నేహంతో పవిత్రమైపోయింది.

కానీ, సీతారామయ్యకూ నాకూ స్నేహమేమిటాని చాలమంది ముక్కుమీద వ్రేళ్ళేసుకున్న సందర్భాలున్నాయి. ఆయనతో మొదటిసారి పరిచయమైనాటికి నా వయస్సు మహావుంటే ఇరవై లోపు. సీతారామయ్యకు జుట్టు నెరిసిపోయింది! నడినెత్తిన అరడజను పోచల కంటేలేవు. నలుగురు పిల్లలకు తండ్రి! వయోభేదం కొట్టవచ్చినట్టుగా వుంటాన మా స్నేహాన్ని వైపరీత్యంగా భావించిన వాళ్లు వుంటేవున్నారు. కనీసం కారణాలు తెలిసికొనివుంటే బాగుండేదనిపిస్తుంటుంది నాకు. ఐనా వాళ్ళకంత శ్రమ పడాల్సిన అవసరమేముంది గనుక వాళ్లేమనుకున్నా మా మధ్య ఎలాంటి పొరపొచ్చలు రాలేదు. వయసు చూసుకుని సీతారామయ్య కూడ చిన్నతనంగా భావించలేదు; చిన్న వాణ్ణనే ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సుతో కుంచించుకుపోయి ముఖం చాటేసుకుని తిరగలేదు నేనూ.

సీతారామయ్య వ్యక్తిత్వాన్ని ఒక్క మాటలో చెప్పాలంటే—'ఆత్మాభిమాని' అదిలేని దెవరికని ఎవరైనా ప్రశ్నించొచ్చు. ఆత్మాభిమానాల్ని పణంగా పెట్టి జీవితాలకు తిలోదకాలిచ్చుకున్నవాళ్లు వేల సంఖ్యలో వుండొచ్చు. కానీ సీతారామయ్య వ్యక్తిత్వంలో నాకే అర్థంగాని విలక్షణత, వినిర్మలత గోచరించాయి. కొన్నిరోజులుకనబడకపోతేసీతారామయ్య రాక కోసం తపించినక్షణాలుఇంకా నాకు జ్ఞాపకం వున్నాయి!

సీతారామయ్య పెద్దగా చదువుకున్నవాడు కాదు. ఫిఫ్తు ఫారం ఫెయిలయినట్లు చెప్పకొనేవాడు నాతో. ప్రయత్నించి వుంటే ఏదో వుద్యోగం దొరికేదని కూడ అంటుండేవాడు. ఎందుకు ప్రయత్నించ

లేదని ఒకటి రెండుసార్లు అడిగిన గుర్తు. దానికి ఆయన చెప్పిన సమాధానం స్వేచ్ఛను చంపుకోవల్సి వుంటుందని. ఉద్యోగమన్న తర్వాత నియమ నిబంధనలు వుండక తప్పదు. గవర్నమెంటులో కొంచెం కఠినంగా వుండొచ్చు. కాని మినిమం సెక్యూరిటీ వుంటుంది కదా అన్నాను దానికి సీతారామయ్య జవాబు చెప్పకుండా పల్చగా నవ్వేసి వూరుకొన్నాడు.

సీతారామయ్య చాల ఉద్యోగాలు చేశాడు. మొదట ఓ బస్సు కంపెనీలో లెక్కలు రాసేవాట్ట. ఆ రాతకోతలు పూర్తిచెయ్యటానికి ఇరవై నాలుగు గంటలు సరిపోయేవి కాదట. పైగా ఎప్పుడూ ఏవో చీవాట్లూ, బెదిరింపులూ. ఆ ఉద్యోగం మానుకున్నాడు. తర్వాత చేసిన ఉద్యోగం హోల్‌సేల్ బియ్యం వ్యాపారి దగ్గర లెక్కలురాయటం;దొంగ లెక్కలు చూపమని యజమాని ఆజ్ఞ. తప్పుడుపన్లు చెయ్యనని సీతారామయ్య ప్రతిజ్ఞ; చేతనయిన పనే చూసుకోమన్నాట్ట వ్యాపారి నిక్కచ్చిగా, అక్రమలాభార్జనే పరమావధిగనుక. బయటికొచ్చాడు సీతారామయ్య.

ఇక లాభంలేదని హైదరాబాద్‌చేరాడు తను ఎక్కడో ఒకచోట యిమడలేదని సీతారామయ్యకు బాగా తెలుసు. వుద్యోగాలు మారుస్తూ పోతుండాలి. ఏదో అనుభవం తన్ను బతికిస్తుందితప్ప, నిలకడగా నిశ్చింతగా కాలం దొర్లించడంఅసాధ్యం. అంచేత హైదరాబాదొచ్చానన్నాడు సీతారామయ్య.

నిజంగా నేను నవ్వకుండా వుండలేక పోయాను. నూరు నూటపాతిక రూపాయల జీతంతో కుటుంబాన్ని పోషించటమే ప్రళయం. వుద్యోగాలు మారుస్తూ వుంటే, మధ్యనవచ్చే అవాంతరాలకు కొన్ని నెలలు జీతమే లేకపోవచ్చు. అపుడు ఆకలి డొక్కలకు సమాధానం చెప్పటం ఎలా? బహుశ సీతారామయ్య అవన్నీ ఆలోచించి వుండడనుకుంటా.

హైదరాబాదు చుట్టు ప్రక్కల గ్రామాల్లో పదిపదిహేను రోజులు మకాం వేసి ఇంటికొస్తుండేవాడు. నేను అద్దెకుంటున్న గది ప్లస్ వరండాకు పాలుగే రూపాయలిస్తుండేవాణ్ని, పక్కనే వున్న గదికి రెండు రూపాయలు చెల్లిస్తుండేవాడు సీతారామయ్య. వీధిలో పంపునీళ్ళు వాడలో మూలగా వున్న మరుగుదొడ్డీ మా అవసరాల్ని తీరుస్తుండేవి. సీతారామయ్య రెండు మూడు రోజులు మాత్రం యింటిపట్టున వుండేవాడు. ఆ రెండు మూడురోజులు నాకు ఎంతో ఉల్లాసంగావుండేది. కుటుంబ జీవితాన్ని,ఆర్థిక యిబ్బందుల్నీ గురించిగాక, మా సంభాషణంతా కళారంగంమీదనే కదనుతొక్కేది. సీతారామయ్య మంచి గాయకుడు. ముఖ్యంగా నాటకాల్లోని పద్యాలు చక్కగా పాడేవాడు. అద్దంకి పద్యం పాడే పద్ధతి అనుకరిస్తూ సీతారామయ్య పొందే పారవశ్యాన్ని చూసి తీరాల్సిందే కాని వివరించటం కష్టం.

మనిషికో పిచ్చి మహిలోసుమతి కదా! సీతారామయ్యకు సంగీతం పిచ్చయితే, నాకు సాహిత్యం పట్ల మోజు. తెగ చదవటంతో ప్రారంభమైన మోజు కథలు రాయాలనే దుగ్ధతో పరా

కొష్ట చేందింది. సీతారామయ్యతో పరిచయమైననాటికే నా కథలు కొన్ని పత్రికలకెక్కాయి। అవన్నీ సీతారామయ్యకిచ్చాను చదవమని. అక్కడినుంచి మా స్నేహం దినదిన ప్రవర్ధమానమైందనుకోవచ్చు. హైదరాబాదులో సీతారామయ్య వుండే రెండు మూడు రోజులూ యిద్దరం ఒక్కక్షణం విడిగా వుండే వాళ్ళం కాదు।

రెండేళ్ళు గడిచాయి। నలభై రెండేళ్ల సీతారామయ్యకూ, ఇరవై రెండేళ్ల నాకూ అపూర్వ మైత్రి ఏర్పడింది. శనివారం సాయంత్రంకల్లా ఎంత దూరంలో వున్నా యింటికొచ్చేవాడు. మళ్ళీ సోమవారం ఉదయమే వెళ్ళేవాడు. అంటే వారంలో నలభై ఎనిమిది గంటలు సీతారామయ్యా నేనూ దాదాపు అంటిపెట్టుకుని తిరిగే వాళ్ళం: పేళకింత వుడకేసిపెట్టి, పెద్దదిక్కుగా నాకున్నదల్లా మా ముసలి మేనత్త ఒక్కటే। సీతారామయ్య పెద్ద పిల్ల దగ్గరలోనే వున్న గవర్నమెంటుస్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతుండేది. రెండో పిల్ల, మూడో పిల్ల ప్రయిమరీ స్కూలు చదువు. అప్పటికి ఆఖర్న మగపిల్లవాడు. వయస్సు రెండేళ్ళేఅయినా ముగ్గురాడపిల్లలకు మించి అల్లరిచేస్తుండేవాడు. సీతారామయ్యకు వాడంటే చాలా ముద్దు. శక్తి మేరకు దిట్టంగా మేపటం సీతారామయ్యకు సరదా. అంతకన్న మరో విధంగా తృప్తిపొందే అవకాశం లేదనుకున్నాడేమో. నూటపాతిక రూపాయల్తో ఐదుగురి ఆకల్ని, యితర అవసరాల్ని ఎలా తీరుస్తుండేవాడో యిప్పటికీ నాకు అంతపట్టని మిస్టరీ. సీతారామయ్య సిగరెట్లు కాలుస్తాడు ఆ రోజుల్లోనే రోజుకో యాభై పైసలు తగలెయ్యటానికి ఖర్చుపెడుతుండేవాడు. ఎన్నడూ నన్ను రూపాయి చేబదులు అడిగిన పాపాన పోలేదు. నాకొచ్చే వంద రూకల్లో కావాలంటే పదో పరకో మిగుల్చుకోగలను. అడిగితే సీతారామయ్యకు పదిరూపాయలు అప్పుపెట్టగలను. కానీ, సీతారామయ్య నా కలాంటి అవకాశం యివ్వలేదు. ఇస్తే తిరిగిపుచ్చుకో ననుకుని వుంటాడు సీతారామయ్య. అంత నిర్మోహమాటమైన మనిషి! కలిసి ఖర్చుపెట్టటంలో మటుకు ఇద్దరం సమ ధీటులమే. ఐతే మా ఖర్చు మొత్తం కలిపినా ఐదారు దాటేది కాదు నలభై ఎనిమిది గంటల్లో।


అలా పక్క పక్కన వుంటూ గాఢమైన స్నేహంతో, ఆత్మీయతతో ముడిపడ్డ హృదయాల్లో అకస్మాత్తుగా తుఫాను రేగింది. కారణం ఎవరో అయితే ఇద్దరము బాధపడే వాళ్లంకాదు. సీతారామయ్యే। తనే కారకుడైనా నాకన్నా ఎక్కువ బాధపడ్డాడు. అప్పుడనుకున్నాను, కాపరం మార్చటానికి ఏదో సబబైన కారణమే వుండి తీరాలని. హైదరాబాదుకు పదిహేనుమైళ్ళ దూరంలోవున్న ఒకవూళ్ళో వుండవల్సివచ్చిందన్నాడు సీతారామయ్య 'ఎందుకు అనవసరంగా' అని నేనూ అనలేక పోయాను. అవసరం కాబట్టే మారుస్తున్నాడు మరి।

చాల రోజులు నా గుండెల నిండా వ్యక్త పరచలేని వెలితి: కాలం గడవక మనసు చట్టులా తయారవుతోంది. ఇది వరలో వారానికైనా వస్తాడూ, దైనందిన గొడవల సుడిగుండంలో నుంచి బయట

పడి మాది అన్న ఒక ప్రత్యేక ప్రపంచంలో నలభై ఎనిమిది గంటలు మైమరచిపోగలమనే ఆశ_ నిరీక్షణ వారమంతా నన్ను వుత్సాహంలో ముంచెత్తేది. సీతారామయ్య ఎన్నాళ్లకు కలుస్తాడో? అసలు హైదరాబాదుకు వచ్చే వీలుంటుందో వుండదో? వస్తే భోజనం చెయ్యాల్సి వస్తుందని మా యింటికి రావటమే మానుకుంటాడేమో? ఏవిటో క్రమంలేని ఆలోచనలు.... అసంబద్ధమైన సందేహాలు! అన్నిటికీ మూలం సీతారామయ్య దూరమైపోవటం. మంచి సహచరుణ్ణి పరిస్థితులు లాంగదీసుకున్నాయన్న ఆవేదన! నేను రాసిన ప్రతి థా వుత్సాహంతో చదివి, ఉపయుక్తమైన సలహాలిచ్చే అనుభవశాలి. మొదటి పాఠకుడు సీతారామయ్య కావటం నిజంగా నా అదృష్టమే! వెయ్యిమంది పాఠకుల పెట్టు ఆయనొక్కడు! ఇక నేనేది రాసినా నేనే చదువుకుని ఏ పత్రికకో పంపాలి! వాటి బాగోగులు నిర్ణయించే మిత్రుడు మరొకడు లేడు.

రానురాను జీవితం నాకు మరీ నిస్సారంగా వుంటోంది. దినచర్య మనిషిలో జడతను పెంచుతోంది. రాయాలన్న ధ్యాసే పుట్టటంలేదు.

రెండు నెలలు దొర్లిపోయాయి. ఒక రోజురాత్రి పదిగంటలకు సీతారామయ్య తలుపుతట్టి పిల్చాడు. ఆయన గొంతు గుర్తుపడుతూనే నా గుండెల్లో ఆనందం వర్షించింది. సీతారామయ్య స్నానం, భోజనం ముగించాక పక్కలమీద వాలి మాటలు మొదలుపెట్టాం. ఊళ్లో కాపరం అనుకున్నంత సుఖంగా లేదన్నాడు.



నెలకోమారైనా హైదరాబాదుకు రావల్సిన పనుంటుందని చెప్పినప్పుడు నా ఆనందం రెట్టింపయింది. ప్రక్కవాళ్ళకు నిద్రాభంగం కలగనిస్థాయిలో సీతారామయ్య పద్యాలు పాడాడు. విని పరవసించాను. "ఏవన్నా రాశావా?" అన్నాడు సీతారామయ్య సిగరెట్ ముట్టిస్తూ, నిర్లిప్తంగా నవ్వాను నేను. తెల్లవారుఝాము వరకూ మాటల్లోనే గడిపాం. ముఖం కడుక్కొని సంచి తీసుకొని వెళ్ళిపోయాడు సీతారామయ్య.

ఆ వెళ్ళటం మూడునెల్ల కొచ్చాడు మళ్ళీ మనిషి చాలా కృశించాడు. ముఖంలో జీవకళలేదు. ఎందుకో బాగా గడ్డం పెంచేశాడు. నా గుండె నీరయిపోయింది.

"ఏవిటి అలాగున్నారు?" అన్నాను దిగులుగా. కళాహీనమైన ఓ చిరునవ్వు విసిరి తన పాదాలవంక చూపించాడు

సీతారామయ్య. నిండా గాలికొట్టిన ఫుట్ బాల్ బ్లాడర్‌లా వున్నాయి పాదాలు. నా మనసు వికవిక లాడింది!

"ఏవిటి జబ్బు?" అన్నాను జీర గొంతుతో.

"అదే అర్థంకావటంలేదు నాకు. ఐదారు సంవత్సరాల తర్వాత మా ఆడవాళ్ళను, పిల్లలను మొన్ననే పుట్టింటికి పంపాను. ఆవిడకూ వంట్లో బాగాలేదు. మూడోనెల గర్భిణీ! బ్రతికి బట్టకడితే నేను, మళ్ళీ వస్తారు వాళ్ళు." అన్నాడు. అలా అంటున్నప్పుడు సీతారామయ్య స్వరం దుఃఖంతో పూడుకుపోయింది. కళ్ళు చెమర్చటం కూడ గమనించాను.

"ఏదన్నా వైద్యం చేయిద్దాం...." అన్నాను బాధగా.

"ఆఁ ఎందుకులే...." అన్నాడు సీతారామయ్య నిర్వికారంగా.

మరి నేను మాట్లాడలేదు. ఆ సాయంత్రం మా ఇంటి పక్కనున్న ఓ ఆయుర్వేద వైద్యుడు యాదృచ్ఛికంగా సీతారామయ్యను చూసి, ఆయన వినకుండా "మీతో మాట్లాడాలి రండి సర్''అంటూ నన్ను రోడ్డు మీదికి తీసుకు వెళ్ళాడు.

ఆయన చాల ప్రమాదకరమైన స్థితిలో వున్నాడు.ఆ జబ్బు తీరు మీకుతెలియదు. నిర్లక్ష్యం చేశారో తొలకరి చినుకులు రాలడం ఆలస్యం—అంతే!' అన్నాడు నా గుండెలవిసిపోయాయి! తొలకరి చినుకులు పడటానికి మరో నెల పదిహేనురోజుల టైముంది. మహా అయితే ఇంకో పదిరోజులు! డాక్టరు చెప్పిన విషయం దాచకుండా సీతారామయ్యతో చెప్పేశాను. అంతటి ప్రమాదకరమైన జబ్బు మనిషి యింట్లో వుంచుకోవటం ఎలాగానన్న సంకుచితమైన ధోరణి నా ఆలోచనలో చోటు చేసుకుంది.

"సీతారామయ్యగారూ మీరు వెంటనే ఉస్మానియా హాస్పిటల్లో చేరాలి. నా శాయశక్తులా మీకు ఉపచర్య చేస్తాను" అన్నాను నచ్చచెప్పే పద్ధతిలో. సీతారామయ్య అదే చిరునవ్వు — అదే నిర్లిప్తత వ్యక్తపరచాడు. సమాధానంగా ఆయన వ్యక్తిత్వం తెలిసినవాణ్ణి కావటాన నేనూ అంతకన్న వత్తిడి చెయ్యలేదు.

పొద్దున్నే లేచి — "వూరు వెళతున్నాను...." అన్నాడు మామూలుగా.

"మళ్ళీ ఎప్పుడొస్తారు ?" అన్నాను మళీ అదే చిరునవ్వు! నా గుండెల్ని కోసేస్తూ వెళ్ళిపోయాడు సరిగ్గా నెలాపదిహేనురోజుల తర్వాత సీతారామయ్య చనిపోయిన వార్త విన్నప్పుడు రెండు రోజులముందు పడ్డ తొలకరి చినుకులే జ్ఞాపకం వచ్చాయి. నాకు తెలిసీ మృత్యుముఖంగా ప్రయాణించిన సీతారామయ్య వ్యక్తిత్వంపట్ల నాకున్న గౌరవం వీసమెత్తు తగ్గలెదు. కాని ఆయన ఆర్థిక స్తోమతకు తగినట్లుగా జాగ్రత్తపడి వుంటే ఆయన జీవితంలో అంతత్వరగా చీకటి తెరలు జారేవికావు. బహుశ అలాంటి ఆలోచననే మనసులో సుళ్ళు తిరిగి సీతారామయ్యకు గమ్యాన్ని నిర్దేశించివుంటుందని నా నమ్మకం!